# ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

రామగుండం/ఫెర్టిలైజర్‌సిటీ/సుల్తానాబాద్‌రూరల్/జ్యోతినగర్/కమాన్‌పూర్: పార్లమెంట్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. వేసవి దృష్ట్యా ఉదయం పూట ఓటర్లు అధిక సంఖ్యలో వచ్చారు. వయస్సు, ఆరోగ్యం సహకరించకపోయినా.. వృద్ధులు, దివ్యాంగులు తమ బాధ్యతను నెరవేర్చారు. కొత్తగా అర్హత పొందిన యువత ఓటేశారు. ఆయా పార్టీల నాయకులు పోలింగ్ సరళిని పరిశీలించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అధికారులు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.


ఓటేసిన పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి


సుల్తానాబాద్‌లో బీఎల్‌వోల వద్ద పోల్ చిట్టీలు తీసుకుంటున్న ఓటర్లు


సుల్తానాబాద్‌లో సిరా వేలిని చూపిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి

### సుల్తానాబాద్ పట్టణంలో..

సుల్తానాబాద్: పట్టణంలో 14 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొన్ని ప్రాంతాల్లో పోల్ చిట్టీలు ఓటర్లకు చేరలేదని బీఎల్‌వోలను నిలదీశారు. ఓటింగ్ సరళిని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పరిశీలించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై శ్రావణ్‌కుమార్ చర్యలు చేపట్టగా.. ఏసీపీ కృష్ణ పరిశీలించారు. పెద్దపల్లి అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ ఓటింగ్ సరళిని పరిశీలించి నూతనంగా ఓటేసిన ఓటర్లకు గులాబీ పువ్వులు అందజేశారు. సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి ఓటు హక్కును వినియోగించుకున్నారు. తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, మున్సిపల్ కమిషనర్ వేణు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.


తెలుకుంటలో కొత్తగా ఓటు హక్కు వినియోగించుకుంటున్న యువతులు

### జూలపల్లి మండలంలో..

జూలపల్లి: పోలింగ్ ప్రారంభంలో జూలపల్లిలో 279, కుమ్మరికుంటలో 269 ఈవీఎంలు మొరాయించగా.. అరగంట తరువాత పోలింగ్ యధావిధిగా ప్రారంభమైంది. 21,964 ఓటర్లుండగా.. 24 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. 73.74 శాతం పోలింగ్ నమోదయ్యింది. మహిళలు 8,021, పురుషులు 8,175 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. కోనరావుపేటలో ఎంపీపీ రమాదేవి, తెలుకుంటలో జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, జూలపల్లిలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ దంపతులు ఓటేశారు.


బేగంపేటలో వరుసలో ఓటర్లు

### రామగిరి మండలంలో..

రామగిరి: పార్లమెంట్ ఎన్నికలు మండలంలోని 47 పోలింగ్ స్టేషన్లలో ప్రశాంతంగా ముగిశాయి. పన్నూర్ గ్రామంలో పోలింగ్ సరళిని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, జెడ్పీ చైర్మన్ పుట్ట మధు పరిశీలించి కార్యకర్తలతో ముచ్చటించారు. రామయ్యపల్లి గ్రామంలో ఎంపీపీ ఆరెల్లి దేవక్క దంపతులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.


పన్నూర్‌లో కార్యకర్తలతో ముచ్చటిస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్


రామయ్యపల్లిలో ఓటేసిన ఎంపీపీ ఆరెల్లి దేవక్క దంపతులు

### ధర్మారం మండలంలో..


దొంగతుర్తిలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన సీపీ శ్రీనివాస్

ధర్మారం: మండలంలోని 53 పోలింగ్ కేంద్రాల్లో 73.79 శాతం ఓట్లు పోలైనట్లు తహసీల్దార్(ఆర్వో) రజిత తెలిపారు. 45వేల ఓటర్లుండగా.. 33,204 ఓట్లు పోలయ్యాయి. పురుషులు 16,436 మంది, మహిళలు 16,767 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ధర్మారం, నందిమేడారం పోలింగ్ కేంద్రాలను ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి సందర్శించారు. దొంగతుర్తి పోలింగ్ కేంద్రాన్ని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ సందర్శించి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. దొంగతుర్తి పోలింగ్ కేంద్రాన్ని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ సందర్శించారు.


ధర్మారంలో కార్యకర్తలతో ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే వివేక్

### ఓదెల మండలంలో..


ఓదెలలో ఓటేసేందుకు వస్తున్న మహిళలు

ఓదెల: మండలంలో 69 శాతం పోలింగ్ నమోదైంది. కొలనూర్, ఓదెల, పొత్కపల్లి, కనగర్తి, గుంపుల, గూడెం, గోపరపల్లె గ్రామాల్లో మహిళలు, పురుషులు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. సమస్యాత్మకమైన గ్రామాలైన గుంపుల, గూడెం, జీలకుంట, గుండ్లపల్లె గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై అశోక్‌రెడ్డి పర్యవేక్షించారు.

### ఎలిగేడు మండలంలో..


ధూళికట్టలో..

ఎలిగేడు: మండలంలోని 12 గ్రామాల 22 పోలింగ్ కేంద్రాల్లో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 72.98 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు.

### కాల్వశ్రీరాంపూర్ మండలంలో..


కాల్వశ్రీరాంపూర్‌లో వైద్యశిబిరం ఏర్పాటు

కాల్వశ్రీరాంపూర్: గంగారం గ్రామంలో ప్రారంభంలో.. పందిల్ల గ్రామంలో సాయంత్రం ముగింపు సమయంలో ఈవీఎంలు మొరాయించాయి. టెక్నికల్ సిబ్బంది వచ్చి సరి చేశారు. ఈవీఎంలు మొరాయించిన చోట ఓటర్లు నిరీక్షించక తప్పలేదు.

### ముత్తారం మండలంలో..


ముత్తారంలో వరుసలో ఉన్న ఓటర్లు

ముత్తారం: మండలంలోని 14 పంచాయతీల 29 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 23,292 ఓటర్లకు గాను 15,880 మంది ఓటేశారు. మండలంలో మొత్తం 68 శాతం పోలింగ్ నమోదయ్యింది. ముత్తారం పోలింగ్ కేంద్రాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ సందర్శించారు. ఎస్సై మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. తహసీల్దార్ సుమన్, ఎంపీడీవో లలిత పర్యవేక్షించారు.

### పాలకుర్తి మండలంలో..


బసంత్‌నగర్‌లో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ

పాలకుర్తి: మండలవ్యాప్తంగా మొత్తం 38 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా.. కన్నాల గ్రామంలోని 63వ పోలింగ్ బూత్‌లో అరగంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. కొత్తపల్లి గ్రామంలో దాదాపు 1,200కు పైగా ఓటర్లుండగా.. కేవలం ఒక్క పోలింగ్ బూత్ మాత్రమే ఏర్పాటు చేయడంతో స్థానికులు వేచి ఉండాల్సి వచ్చింది. బసంత్‌నగర్, కన్నాల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ తనిఖీ చేసి పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. బసంత్‌నగర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలతోపాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను 13వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ నాగేశ్వరరావు సందర్శించి భద్రతా చర్యలను పర్యవేక్షించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బీజేపీ రాష్ట్ర నాయకుడు సోమారపు అరుణ్‌కుమార్ పోలింగ్ సరళిని పరిశీలించారు.


పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన గోదావరిఖని ఏసీపీ రమేశ్


ఓటేసిన శతాధిక వృద్ధురాలు

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీ, సింగరేణి ప్రభావిత గ్రామాల్లో ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించారు. కాలనీ, 15, 16, 17, 18, 19 డివిజన్లలోని న్యూమారేడుపాక, అల్లూరు సంతోష్‌నగర్ తదితర ప్రాంతాలతోపాటు రామగిరి మండలం వెంకట్రావుపల్లి, సుందిళ్ల, ముస్త్యాల పెద్దంపేట, చందనాపూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వియోగించుకున్నారు. అల్లూరు గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో శతాధిక వృద్ధురాలు అజిమ్‌త్ ఉన్నిసా తన ఓటు హక్కును వినియోగించుకుంది. గోదావరిఖని ఏసీపీ రమేశ్ తన సిబ్బందితో కలిసి పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. గోదావరిఖని టూటౌన్ సీఐ రవీందర్ తన సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహించారు.


ఫెర్టిలైజర్‌సిటీ: ఓటు వేయించేందుకు వృద్ధున్ని తీసుకెళ్తున్న పోలింగ్ సిబ్బంది


సుల్తానాబాద్‌రూరల్: వికలాంగ వృద్ధురాలిని వీల్ చైర్‌లో తీసుకెళ్తున్న మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి


రామగుండం: ఓటర్లతో ముచ్చటిస్తున్న ఎంపీడీవో ఎంఏ అలీం


జ్యోతినగర్: ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న ఏసీపీ రమేశ్, సీఐ అజయ్‌బాబు


కమాన్‌పూర్‌లో ఓటేసిన మహిళలు

### చెట్ల నీడే దిక్కు..



పెద్దపల్లిరూరల్: మండుతున్న ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు చెట్ల నీడ దిక్కయింది. నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద నిలువ నీడ లేకపోవడంతో సమీపంలో ఉన్న చెట్ల నీడన ఓటర్లు సేద తీరారు.

### ఓటరు జాబితాలో పేరుందా..



పెద్దపల్లిరూరల్: ఓటరు జాబితాలో నా పేరుందా.. ఇదివరకు ఓటు వేసిన పోలింగ్ కేంద్రానికి వెళితే అక్కడ లేదంటున్నరు అంటూ పలువురు ఓటర్లు ఆందోళనతో ఇలా ఓటరు జాబితాలో పేరు ఉందో.. లేదోనంటూ వెదుకులాడారు. ఎన్నికల అధికారులు ఇంటింటికీ ఓటరు స్లిప్పులు అందించామంటూ చెప్పుకున్నా.. చాలామంది తమకు ఓటరు స్లిప్పు రాలేదని, తమ పోలింగ్ కేంద్రం ఎక్కడో చెప్పాలంటూ పోలింగ్ కేంద్రాల చుట్టు తిరిగారు.

## పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్

ఎలిగేడు: మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 261 పోలింగ్ కేంద్రం, జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన 263, 264 పోలింగ్ కేంద్రాలను అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ సందర్శించి పరిశీలించారు. తహసీల్దార్ స్వర్ణ, ఎంపీడీవో భాస్కర్‌రావు, సెక్టార్ ఆఫీసర్ ఉమాపతి, పంచాయతీ కార్యదర్శి సౌమ్య తదితరులున్నారు.

రామగిరి: బేగంపేట గ్రామంలో పోలింగ్ సరళిని జిల్లా అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ పరిశీలించారు. తహసీల్దార్ రాంచందర్‌రావు, సిబ్బంది ఉన్నారు. రత్నాపూర్ గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అబ్జర్వర్ రవి గుప్తా, సీఐ రాజమౌళి పరిశీలించారు.

ఓదెల: కొలనూర్ గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ సందర్శించారు. తహసీల్దార్ యాకయ్య పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్, ఆర్డీవో గంగయ్య, తహసీల్దార్ జాహెద్ పాషా, ఎంపీడీవో రామ్మోహనాచారి పోలింగ్ బూత్‌లను సందర్శించారు. గంగారం, పందిల్ల గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడంతో.. వెంటనే టెక్నికల్ సిబ్బందిని రప్పించి పోలింగ్ కొనసాగేలా చూశారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు కాల్వశ్రీరాంపూర్ జెడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ సరళిపై ఆరా తీశారు. మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, నాయకులు మాదాసి సతీష్, సబ్బని రాజమల్లు, దేవేందర్, శ్రీనివాస్ తదితరులున్నారు.


ఎలిగేడులో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

### పాన్‌వాలాతో మంత్రి మాటామంతి



మంథని: రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంథనిలోని ఓ పాన్‌వాలాతో సంభాషించారు. సిగరెట్లు.. గుట్కాల వినియోగంపై ఆరా తీశారు. అనంతరం స్వీట్ పాన్ స్వీకరించారు. పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ సైతం స్వీట్ పాన్ ఆరగించారు.

**కాంగ్రెస్ అధిక సీట్లు గెలుస్తుంది**

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక సీట్లు గెలుస్తుందని, పోలింగ్ సరళిని బట్టి తెలుస్తోందని రాష్ట్రమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి వంశీకృష్ణతో కలిసి ఆయన పట్టణంలో సోమవారం ఓటర్లను పలుకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న గ్యారంటీలు, ప్రజాసంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని, ప్రజలుమార్పులో భాగస్వాములు అవుతున్నారని అన్నారు. మూడు నెలల్లోనే ప్రభుత్వ పనితీరుపై మంచి అభిప్రాయం వ్యక్తమవుతోందని తెలిపారు. వంశీకృష్ణ అధిక మెజారిటీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు.

### పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్



రామగుండం: రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాకూర్ రామగుండం, అంతర్గాం మండల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. కుందనపల్లి, టీటీఎస్ అంతర్గాం, ముర్మూర్ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఉదయం నుంచే బారులు తీరారు.

### కాంగ్రెస్ విజయం ఖాయం



సుల్తానాబాద్: పెద్దపల్లి పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఓటింగ్ సరళిని ముఖ్య నాయకులతో చర్చించారు. ఓటింగ్‌తోపాటు ప్రజల నాడి ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు అన్నయ్యగౌడ్, ముస్త్యాల రవీందర్, గాజుల రాజమల్లు, రాజలింగం, తిరుపతి, ఆంజనేయులు, రాజు, ఖలీమ్ పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

సుల్తానాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పే అవకాశం అత్యధికంగా ఉందని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఓటింగ్ సరళిని పరిశీలించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు వంద రోజుల్లో అమలు చేస్తామని మాట మార్చడంతో.. ప్రజలు కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కొప్పుల ఈశ్వర్ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కౌన్సిలర్లు గొట్టం లక్ష్మి, అనుమాల అరుణ, గొట్టం మహేశ్, రాజు, రఫిక్, రాజేందర్, సర్వర్, వాహిద్, టీకే ప్రభాకర్, బాబురావు, గొట్టం స్వప్న, రజిత పాల్గొన్నారు.


సుల్తానాబాద్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

ఓదెల: మండలంలో పోలింగ్ సరళిని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పరిశీలించారు. పొత్కపల్లి, ఇందుర్తి, బాయమ్మపల్లె, గుంపుల, ఓదెల, గూడెం గ్రామాల్లో కార్యకర్తలు, నాయకులతో చర్చించారు. ఓదెల జెడ్పీటీసీ గంట రాములుయాదవ్ పలు గ్రామాల్లో ఓట్ల శాతం గురించి ఆరా తీశారు.

### నిస్సహాయులకు హోంగార్డు చేయూత..



రామగుండం: అంతర్గాం మండల పరిధి లింగాపూర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఎన్నికల పోలింగ్ కేంద్రంలో రామగుండం యూనిట్ పరిధిలోని పి.శ్రీనివాస్(1250) అనే హోంగార్డు పలువురికి సేవలందించి ఓటర్ల మన్ననలు పొందారు. ఓ కాలు లేని వికలాంగుడిని బయట నుంచి పోలింగ్ కేంద్రానికి వీల్‌చైర్‌లో తీసుకొచ్చి ఓటేయించి తిరిగి పంపించారు. నడవడమే కష్టంగా ఉన్న ఓ వృద్ధురాలి చేయి పట్టుకొని పోలింగ్ కేంద్రంలో ఓటేయించి పంపించారు.

### ప్రతిభ చూపిన కేవీ విద్యార్థులు


ఉల్లి హారిక


సింగ్


హాసిని

జ్యోతినగర్(రామగుండం): సెంట్రల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్‌లో ఎన్టీపీసీ రామగుండం కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు విజయదుందుభి మోగించారు. సోమవారం విడుదల చేసిన పదో తరగతి, పన్నెండో తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలో టాపర్‌గా నిలిచింది. పదో తరగతిలో 54 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 54 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉల్లి హారిక(483/500), ఇషాన్ సాహూ(479/500), కొట్ల సిరి(470/500), బొంగోని శ్రీనిధి(441/500), ఆదిత్య రాజ్(441/500) మార్కులు సాధించారు. అలాగే 12వ తరగతిలో 27 మంది పరీక్షలకు హాజరుకాగా 27 మంది ఉత్తీర్ణులయ్యారు. సైన్స్‌లో ఆగంజిత్‌సింగ్(485/500), శ్రీలక్ష్మీప్రియ మహేందరన్(422/500), లక్ష్మీప్రియదర్శిని(410/500), కామర్స్‌లో జూపల్లి హాసిని(444/500), అంబరీశ్(421/500), గొట్టి సోనాలి సేన్(408/500) మార్కులు సాధించారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించడంపై విద్యాలయ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు, ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు, ప్రిన్సిపల్ ఓరుగంటి శోభన్‌బాబులు విద్యార్థులను అభినందించారు.

### మోడల్ పోలింగ్ కేంద్రం సందర్శన



గోదావరిఖని: స్థానిక టీటీసీలోని మోడల్ పోలింగ్ కేంద్రాన్ని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ సోమవారం సందర్శించారు. ఓటరు జాబితా, మౌలిక వసతులపై ఆరా తీశారు.

**ఎన్టీపీసీలో..**

జ్యోతినగర్(రామగుండం): రామగుండం అసెంబ్లీలోని 56 నంబరు పోలింగ్ కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ సందర్శించారు. ఓటరు జాబితా, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై ఆరా తీశారు.

## క్లుప్తంగా

### గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి


రవిగౌడ్(ఫైల్)

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ఖాజీపల్లి గ్రామానికి చెందిన ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పూజారి రవిగౌడ్(54) సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు. ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్ ఆటో యూనియన్ నాయకులు పూజారి రవి కుటుంబాన్ని పరామర్శించారు. పార్థివ దేహానికి నివాళి అర్పించారు. ఆటో డ్రైవర్లు స్వచ్ఛందంగా ఆటోల బంద్ పాటించారు.

**అనారోగ్యంతో పారిశ్రామికవేత్త..**

సుల్తానాబాద్: పట్టణంలోని పూసల రోడ్డులో నివాసముండే ప్రముఖ పారిశ్రామికవేత్త కొమురవెల్లి వీరభద్రయ్య(70) అనారోగ్యంతో మృతిచెందారు. సోమవారం సుల్తానాబాద్‌లో దహన సంస్కారాలు నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న వ్యాపారులు, పలువురు ప్రజాప్రతినిధులు మృతికి సంతాపం తెలిపి కుటుంబాన్ని ఓదార్చారు.

### ఆమె చూపు సజీవం


సవిత(ఫైల్)

కోల్‌సిటీ: గోదావరిఖని స్వతంత్రచౌక్‌కు చెందిన జంగంపల్లి సవిత(48) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందగా.. ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు అదే రోజు రాత్రి ఐ బ్యాంకుకు దానం చేశారు. కాంగ్రెస్ నాయకుడు జంగంపల్లి పోశం భార్య సవిత కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. సదాశయ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కేఎస్ వాసు సూచన మేరకు మృతురాలి నేత్రాలను దానం చేయాలని స్వచ్ఛంద సంఘాల సలహాదారు దయానంద్‌గాంధీ కుటుంబ సభ్యులను ఒప్పించారు. ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంకు టెక్నీషియన్ సతీష్ సహకారంతో నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి రాజమౌళి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కేఎస్ వాసు, స్వచ్ఛంద సంఘాల సలహాదారు దయానంద్‌గాంధీ, సిటీకేబుల్ ఎండీ బాలసాని స్వామిగౌడ్, అయిలయ్య తదితరులున్నారు.

### శివాలయంలో ప్రత్యేక పూజలు


సుల్తానాబాద్ శివాలయంలో పూజలు చేస్తున్న పూజారి మహేశ్

సుల్తానాబాద్: సుల్తానాబాద్ శివాలయంలో సోమవారం పలువురు వ్యాపారులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి రుద్రాభిషేకంతోపాటు అన్నపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. హనుమాన్ స్వాములు హనుమాన్ విగ్రహం వద్ద పూజలు చేశారు. పూజారి మహేశ్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

### ఎల్‌వోసీ అందజేత


ఎల్‌వోసీ అందజేస్తున్న నారాయణరెడ్డి

ఓదెల: గోపరపల్లె గ్రామానికి చెందిన కాశవేని శ్రీలతకు సీఎం రేవంత్‌రెడ్డి సహాయ నిధి నుంచి వైద్య సాయం కింద రూ.2లక్షల ఎల్‌వోసీని పొత్కపల్లి సింగిల్‌విండో మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి సోమవారం అందజేశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీలతకు ఆపరేషన్ నిమిత్తం సీఎం దృష్టికి తీసుకెళ్లగా.. స్పందించి రూ.2లక్షలు మంజూరు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. నాయకులు రాజిరెడ్డి, కాశవేని చేరాలు, గోపు కుమార్ పాల్గొన్నారు.

### ఓటేసిన మాజీ ఎమ్మెల్యే చందర్



గోదావరిఖని: పార్లమెంట్ ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ సోమవారం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి పోలింగ్ కేంద్రానికి చేరుకొని ఓటేశారు.

**మాజీ ఎమ్మెల్యే గుజ్జుల..**



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి పట్టణంలోని ఇండియా మిషన్ హైస్కూల్(38వ నంబరు) పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.